ధాన్యం కొనుగోలుతో రైతులకు మేలు

- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఆత్మకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: నియోజకవర్గ అభివృద్ధి విషయంలో తగ్గేదేలేదని, ఇది వరకే రూ.340 కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని పీఏసీఎస్ కార్యాలయంలో రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం జరగకుండా, తూకాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

సన్నబియ్యం పేదలకు వరం...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పథకం నిరుపేదలకు వరమని, రేషన్‌షాపుల్లో సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలని డీలర్లను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశించారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

దేశం గర్వించేస్థాయికి ఎదగాలి

విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించేస్థాయికి ఎదగాలని, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక జీవీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన విశ్వభారతి హైస్కూల్ 30వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని నిర్వాహకులు బాలరాజు, చంద్రయ్య తో కలిసి ఎస్‌సీసీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం పట్టణంలో మొదటిసారిగా కొత్త టెక్నాలజీతో ఏర్పాటు చేసిన మినరల్‌ప్లస్ వాటర్‌ప్లాంట్‌ను నిర్వాహకుడు మునీర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాష, విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను, గంగాధర్‌గౌడ్, తిరుపతయ్య, బంగారు భాస్కర్, వినయ్‌రెడ్డి, దాము, నాగేష్, సుదర్శన్‌శెట్టి, సాయిరాఘవ, మచ్చేందర్‌గౌడ్, రవీందర్, అబ్దుల్లా, జుబేర్, తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డున్న ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం

అమరచింత: తెల్ల రేషన్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని చంద్రగఢ్ గ్రామంలో శుక్రవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పండుగ పూటనే పేదలు సన్న బియ్యం తినేవారని అలాంటిది, ప్రతి రోజు పేదలు సన్న బియ్యం అన్నం తినాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి పథకానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు.

చేసిన పనులు చెప్పుకోకపోవడం ఏమిటి?

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు లబ్ధిపొందిన వారి వివరాలను వెల్లడించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అసహనం వ్యక్తం చేశారు. రుణమాఫీ, ఉచిత బస్సు, కరెంటు, సబ్సిడీ గ్యాస్‌లతో పాటు గ్రామాల్లో చేపడుతున్న సీసీ, బీటీ రహదారుల నిర్మాణాలకు నిధుల మంజూరు, పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాలకు ఎంత మేరకు నిధులు ఇచ్చామనే విషయాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఇకపై నాయకులు గ్రామాల వారీగా చేసిన అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెల్ప్‌డెస్క్‌ను వినియోగించుకోండి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుద్యోగ యువతి, యువకులకు అందిస్తున్న రాజీవ్ యువ వికాసం హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీపాద్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో 48 మంది అభ్యర్థులు దరకాస్తులు చేసుకున్నారని వివరించారు. మండలంలోని అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ వరకు దరకాస్తులు చేసుకొని, పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాం రెడ్డి, సిబ్బంది, దరకాస్తుదారులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, ఎండల తీవ్రత పెరిగినందున నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఎంపీడీఓ శ్రీపాద్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని అందించారు.

5 శాతం రాయితీ

కొత్తకోట: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను చెల్లించే యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై 5 శాతం రాయితీ కల్పిస్తుందని కొత్తకోట మున్సిపాలిటీ కమిషనర్ సైదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గడువు ఏప్రిల్ 30వ తేదీ వరకు ఉందని, పట్టణ ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కొత్తకోట పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్వాహకులు శ్రీరామ నవమిని పురస్కరించుకొని క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో ఏడు టీంలు పాల్గొంటున్నాయని, మొదటి బహుమతి రూ.6,116, రెండో బహుమతి రూ.3,116 ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అకాల వర్షం.. నేలకొరిగిన పంటలు



కొత్తకోట రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు రైతులకు కన్నీళ్లు మిగిల్చుతున్నాయి. గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు కొత్తకోట శివారులో, మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంటలు నేలకొరిగాయి. అంతే కాకుండా కొనుగోలు కోసం రోడ్లపైకి తీసుకొచ్చిన వరిధాన్యం తడిసిపోయింది. నేలకొరిగిన పంటలను అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలను అడ్డుకున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం శివారులో ఉన్న కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కాల్వ పక్కనే ఉన్న సురేష్‌రెడ్డి భూమి నుంచి సర్వే నెంబర్లు 78లో 0.5 గుంట 79లో 1.26 ఎకరాలను ప్రభుత్వం కాల్వ కోసం తీసుకుందని ఆర్ఐ తిరుపతయ్య తెలిపారు. ఆ భూమిని రికార్డుల నుంచి తొలిగించామన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందినా సదరు వ్యక్తి సుమారు ఒక ఎకరం భూమిని కబ్జాచేసి సైడ్‌వాల్ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సైడ్‌వాల్ నిర్మాణ పనులను పరిశీలించి, నిలిపివేశామని పేర్కొన్నారు. పూర్తి విచారణ జరిగే వరకు నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సర్వేయర్ ఆనంద్, గ్రామస్తులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వీపనగండ్ల: మండలంలోని నాగర్లబండతండాకు చెందిన ముడావత్‌శారదకు రూ.24,500 చెక్కును ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తూంకుంటలో క్యామ లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు రూ.60 వేల చెక్కును వాలె మధన్‌మోహన్‌రావు అందజేశారు. గోవర్ధనగిరిలో సింగనమోని మహేష్‌కు రూ.26,500, గుంటి బిచ్చన్నకు 45 వేలు, లగిశెట్టి లక్ష్మీదేవమ్మకు రూ.7,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, హనుమంతు, వెంకటయ్య, భాస్కర్, భాస్కర్‌రెడ్డి, గట్టురాజయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్లలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలు చురుకుగా ఉండి పార్టీ కోసం పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం గోపాల్‌పేట మండల కేంద్రంలో ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేయించిన బోరును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యశీలారెడ్డి, జయపాల్‌రెడ్డి, శివన్న, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కనులపండుగగా గోవృషభ కల్యాణం



బిజ్వార్‌లో గోవృషభ కల్యాణం జరిపిస్తున్న ఆదిత్య పరాశ్రీ



ఉత్సవాలకు హాజరైన పీఠాధిపతులు

ఊట్కూర్: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రభుత్వాలు ముందుకు రావాలని అంబాత్రయక్షేత్రం వ్యవస్థాపకుడు ఆదిత్య పరాశ్రీ అన్నారు. మండలంలోని బిజ్వార్‌లోని అంబాత్రయ క్షేత్రంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆదిత్య పరాశ్రీ ఆధ్వర్యంలో గోవృషభ కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులు చేసిన అమ్మవారి నామస్మరణతో అంబాత్రయక్షేత్రం మార్మోగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవు ముక్కోటి దేవతల నిలయమని, గోవును పరిరక్షిస్తే పర్యావరణాన్ని, జీవరాశిని సంరక్షించినట్లే అన్నారు. దేశంలో గోవధ నిషేధాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హిందూవుల్లో ఐక్యత లేకపోవడంతో ధర్మంపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన, వైద్య శిబిరం విజయవంతమైంది. వేడుకల్లో పీఠాధిపతులు పంచమ సిద్ధలింగ స్వామి, బాల లింగేశ్వరస్వామి, సంగ్రామ మహారాజ్, రాజయ్య స్వామి, అంబికా శివాయోగ స్వామి, మహానందగిరి స్వామి, నాయకులు నాగురావు నామాజీ, కొండయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

ఆత్మకూర్: శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, నాగదేవత, రమాసత్యనారాయణ స్వామి, శిఖర కలశ ప్రతిష్ఠామహోత్సవాన్ని ఆత్మకూర్‌లోని కన్యకా పరమేశ్వరిమాత ఆలయంలో శుక్రవారం ప్రముఖ వేదపండితుడు శివసుబ్రమణ్యం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిష్ఠ పూజల్లో భాగంగా ఉదయం ప్రాతఃకాల పూజలు, దేవతమూర్తులకు, యంత్రములకు విశేష అభిషేకం, మూర్తిహోమం, అభ్యవర్తిని హోమం, ప్రతిష్ఠాంగహోమం, సర్వప్రాయచిత్తం, జయాధిహోమం, మృగశిర నక్షత్రయుక్త వృషభలగ్న, శుభపుష్కరాంశమునందు గర్తన్యాస, రత్నన్యాస, బీజన్యాస, ధాతున్యాస, పూర్వకయంత్ర, అనంతరం విగ్రహప్రతిష్ఠాపన, బింబకళన్యాసం, కుంభాన్నబలి, క్షజ్వాల, గోదర్శనం, సునాసిని, దీపదర్శనం, ప్రతిష్ఠామూర్తి దర్శనం, విశేష ప్రధమపూజ, బలిప్రదానం, మహాపూర్ణహూతి, దేవత ఉద్యాసన, అవభృతస్నానం, తదితర పూజలు చేశారు.



ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న భక్తులు

ఎమ్మెల్యే వాకిటి ప్రత్యేక పూజలు

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర గీతకార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, సుదర్శన్‌శెట్టి, నిర్వాహకులు బాలీశ్వర్‌శెట్టి, తాండూర్ మోహిని, సహదేవుడు, రమేష్‌శెట్టి, యాదగిరిశెట్టి భక్తులు పాల్గొన్నారు.

ఖిల్లా గట్టు దర్గాలో మంత్రి ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న మంత్రి జూపల్లి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఖిల్లా గట్టుపై ఉన్న హజరత్ ఆఘా దావుద్(ఆఖర్‌సాబ్)గంధోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖిల్లా గట్టుపై ఉన్న చారిత్రక కట్టడాలను కాపాడటం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబెదుల్లా కొత్వాల్ కుటుంబ సభ్యులు, మండల నాయకుడు రాముయాదవ్, మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడపాలంటూ రాస్తారోకో

ఆత్మకూర్: ఆర్టీసీ బస్సును నిత్యం నడపాలంటూ రేచింతల గ్రామస్తులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని చివరి గ్రామమైన రేచింతల నుంచి రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజులకు ఒకసారి బస్సు వస్తుండడంతో విద్యార్థులు, ప్రయాణికులు గత్యంతరం లేక ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, బాలకృష్ణ, కృష్ణయ్య, శాంతన్న, నర్సింహ, బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని కొత్త చెరువు పాటు కాల్వకు సీసీ నిర్మించాలని, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు నిధులు కేటాయించాలని, 1వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న కోనేరు బావిని పూడ్చాలని కోరారు. ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించడంతో పాటు 7, 11 వార్డుల్లో నూతన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయాలని విన్నవించారు. ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి. వెంకటయ్య, భగత్, వెంకటయ్య, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: దేశంలో ప్రజల మధ్య విబేధాలు సృష్టించి రాజ్యపాలన చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో వక్ఫ్ బిల్లును అమలు పరిచి ముస్లింల మనోభావాలను దెబ్బతీయడం తగదన్నారు. వెంటనే వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నరేంద్రమోదీ అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని ఇచ్చినా.. అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మైబు, మల్లేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణోత్సవం



వెంకటాపురంలో సీతారాముడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వనపర్తి రూరల్: శ్రీరామనవమి పురస్కరించుకొని మండలంలోని పెద్దగూడెంలో కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గ్రామ బలిహరణం, నిత్య హోమం చేశారు. ఉత్సవ మూర్తులను ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

వెంకటాపురంలో..

శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం కోదండరాముడి ఆలయంలో శుక్రవారం ఉదయం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం సీతాసమేతుడైన శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో గ్రామంలో ఊరేగించారు.

ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు ప్రారంభం



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రూపాలక్ష్మి

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం వనపర్తి మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం స్పెషల్ క్యాంపు కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రూపాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సామాజిక స్పృహ అలవాటు చేసుకోవడం ఉత్తమమైందన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న, ఏఎస్ఐ రాములు, జెడ్పీహెచ్ఎస్ హెడ్‌మాస్టర్ రాందేవ్‌రెడ్డి, పోతురాజు శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పనికి దగ్గ వేతనం ఇవ్వాలి

వనపర్తి రూరల్: ఆశావర్కర్లతో వెట్టి చాకికీ చేయించుకొని, పనికి తగ్గ పారితోషికం ఇవ్వడం లేదని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధం జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిరా అధ్యక్షతన ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, భాగ్య, దేవమ్మ, మంజుల, శ్యామల, లత, చెన్నమ్మ, కల్పన ఉన్నారు.

హమాలీల హక్కులు కాపాడుతాం



హమాలీ కార్మిక సంఘం నూతన కమిటీ సభ్యులు

కొత్తకోట: సీఐటీయూ ఆధ్వర్యంలో మల్లికార్జున హమాలీ కార్మిక సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేశీ యాదయ్య, కార్యదర్శి కర్నూల్ బాలస్వామి, కోశాధికారి కదిరె నాగన్న, ఉపాధ్యక్షులుగా సందుల కురుమన్న, ఎంసీ కురుమన్న, చెక్కెర నాగన్న, రమేష్, నాగన్న, బాలరాజు, లక్ష్మయ్య ను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు కృపయ్య ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీల హక్కులు కాపాడేందుకు కలిసికట్టుగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు.

వాటర్ బోటింగ్ పోటీలో విద్యార్థి సత్తా



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గురువయ్యగౌడ్

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల ఎంజేపీ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కార్తీక్ జిల్లా స్థాయిలో జరిగిన సైలింగ్ అండ్ యాక్టింగ్ వాటర్ బోటింగ్ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ గురువయ్యగౌడ్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని ఆర్‌సీఓ శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీఈటీ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థికి 20 రోజుల పాటు హైదరాబాద్‌లో ట్రెనింగ్ ఉంటుందన్నారు. నేషనల్‌లో పాల్గొంటే నేవీ అకాడమిలో ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఎంజేపీ పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు.

గురుకుల ప్రవేశ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి ఆకాశ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని వై.శాఖాపూర్ గ్రామంలోని ప్రగతి విద్యాలయంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థి ఈర్లదిన్నె ఆకాష్ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడని కరస్పాండెంట్ మోడాల భీంసాగర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈర్లదిన్నె ఆకాష్‌ను కలెక్టర్ ఆదర్శ్‌సురభి తన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భీంసాగర్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిజో బాబు, ఉపాధ్యాయురాలు అస్మత్ పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ప్రాథమిక పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన భవ్యశ్రీ (బాలనగర్), సృజన (కోడేరు), అక్షర, కృతిక (కొల్లాపూర్) శివకుమార్ (పెద్దకొత్తపల్లి), జ్యోత్స్న, శైలజ (గోపాల్‌పేట), ప్రశాంత్(సింగోటం), దేవాన్ష్ (బిజినపల్లి) కి ఎంపికయ్యారని హర్షం వ్యక్తం చేశారు.

8 మంది విద్యార్థులు..

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లి ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 21 మంది గురుకుల పరీక్ష రాయగా.. 8 మంది సీట్లు సాధించి సత్తా చాటారని హెచ్ఎం నరసింహ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, చిన్నస్వామి, పృథ్వీమాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆత్మకూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులు ఐదో తరగతిలో గురుకులాలకు ఎంపికైనట్లు లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జాఅన్వర్‌బేగ్, మీర్జా అక్తర్‌బేగ్ తెలిపారు. విద్యార్థులు అజిత్ (కడుకుంట్ల), రేణుశ్రీ (కొత్తకోట), సంపత్ (లింగాల), హర్షిత (ఊట్కూర్), షారూన్ (గద్వాల) గురుకులాలకు ఎంపికయ్యారన్నారు. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, అజ్జర్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వన సందర్శన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వనపర్తి రూరల్: వన దర్శిని కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా ఎఫ్ఆర్ఓ నిఖిల్‌రెడ్డి ఆదేశానుసారం వనపర్తి జిల్లా ఆటవీ శాఖ డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రజనీకాంత్ ఆధ్వర్యంలో మండలంలోని చిట్యాల, రాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 6, 7 తరగతుల విద్యార్థులను వన సందర్శన తీసుకొచ్చారు. నూతనంగా విస్తరిస్తున్న అడవిలో నాటిన, నర్సరీలో పెంచుతున్న మొక్కలు, ఏకోపార్క్‌లోని దృశ్యాలను చూపించారు. అనంతరం 120 విద్యార్థులకు పర్యావరణ విద్య, ప్రకృతిపై చిత్రలేఖన కార్యక్రమం నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే ప్రతి విద్యార్థికి పరీక్ష ప్యాడ్, పెన్నులు అందించారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ స్వాతి, విజయ్‌కుమార్, బాలకృష్ణ, బాలస్వామి, ఉపాధ్యాయులు రవి, రుద్రమదేవి, మనీషా, గిరిరాజచారి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలు ప్రతిభకు నిలయాలు

కొత్తకోట రూరల్: గురుకుల పాఠశాలలు ప్రతిభకు నిలయాలని కొత్తకోట ఎంఈఓ కృష్ణయ్య, వీపనగండ్ల ఎంఈఓ నర్సింహ అన్నారు. పట్టణ సమీపంలో గల వీపనగండ్ల ఎస్సీ బాలుర పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓలు కృష్ణయ్య, నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపల్ ఖదీర్‌ఖాన్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు డాక్టర్ రాజేందర్, ఎస్.ప్రశాంత్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.